



చూస్తూండగానే పొలాలు, స్థలాలు, ఇల్లూ, మిల్లూ - అన్నీ కొనేసి - పేడెత్తుకునే మంగమ్మ మేడింటి మంగమ్మగారై పోయింది. పది మందికీ సహాయ పడుతూ - అందరితల్లో నాలుకగా ఉంటూ - దేవత అనిపించుకుంది. జీవితంలో కావలసినవన్నీ అమరినా కన్న తల్లిగా కొడుకును చూసుకుని - అతని భార్యా బిడ్డల్ని చూసుకుని మురిసిపోయే భాగ్యం మాత్రం లేదు. ఎంత నిండు కుండలా బ్రతికినా ఆ తల్లి బాధ ఆ తల్లిదే.

# మెఱుగు దారి

## కొండా కుసుమకుమారి

"మంగమ్మ మంచాన పడిందట!" ఊళ్ళో ఎవరి నోట విన్నా ఇదే మాట!

"శివ శివా, నిన్నటి వరకు పొలమూ, పుట్రా, దర్జీ, తోట్లా? మిల్లూ, కొట్లూ— అన్నీ తనే తిరిగి చూసుకుంది. ఎంతలో ఎంత ఘోరం జరిగింది?"

విన్న ప్రతి ఒక్కరూ ఇదే పలుకు.

"ఎల్లకాలం ఒక్కటేనా ఏమిటి? వచ్చే వయసా, పోయే వయసా?"

"అయినా ఉన్న ఒక్క కొడుకునూ కడసారి చూపుకైనా నోచుకోకుండా పోతుందంటావా? అయ్యో? ఎంత ఘోరం! ఆ కొడుకును కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంది. పంచ ప్రాణాలు ఆ బిడ్డ మీదే పెట్టుకుని బ్రతికింది. కడసారి చూపైనా దక్కితే బాగుండును."

"ఎవరు చెప్పగలరు?. నాలుగేళ్ళుగా ఈ దేశంలో అడుగు పెట్టని మనిషి ఇప్పుడు రెక్కలు కట్టుకొని వాలతాడా? వచ్చినా ఈ ఆస్తి పాస్తుల కోసమే గాని తల్లి కోసం వస్తాడంటావా?"

"ఇప్పుడంటే ఆస్తిపాస్తులు అమిరాయి. ఈ కొడుకు ప్రయోజకుడు కాక ముందు ఎంత కష్టపడింది? కొడుక్కి ఏడాది నిండకుండా తండ్రి పోతే చేరదీసే అండలేక ఒంటరి పక్షిలా ఎన్ని అవస్థలు పడింది? పాచి పనులే చేసిందా, పొలం నులకే వెళ్ళిందా, పాలు పితికి అమ్ముకుందా, పిడకలు కొట్టే బతికిందా - ఒకటేమిటి? రెక్కలు ముక్కలు చేసుకుని కొడుకుని వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు పడరాని పాట్లు పడింది ఆ తల్లి?"

"నిజమే? మగాడిలా కష్టపడింది. కాని ఆ కొడుక్కి బుద్ధుందా? తల్లి ఎలా పెంచి పెద్దవాణ్ణి చేసిందో అన్న జ్ఞానం ఉందా? డబ్బు సంపాదన చూసుకుని దేశం విడిచి వెళ్ళిపోయాడు. ఈ పిచ్చి తల్లి విదేశాలకు వెళ్ళిన కొడుకును చూసుకుని అంబరాన్ని తాకినంత సంతోషపడిపోయింది. కొడుకు రెండు చేతులా సంపాదించి పంపుతుంటే రోజు రోజుకీ పెరిగి పోయిన మేరు పర్వతంలా మనసులో పెట్టుకుని ఒక్కసారిగా మంచానపడింది."

"ఏమోనమ్మా? ప్రాణం పోయే లోపలయినా కొడుకు వస్తే బావుండును."

"నీ పిచ్చి గానీ, నాలుగేళ్ళుగా రానివాడు ఇప్పుడొచ్చి వాలతాడా? మొదట్లో ఏడాదికి, రెండేళ్ళకి వచ్చి తల్లిని చూసిపోయేవాడు. ఇప్పుడదీ భారమై నాలుగేళ్ళుగా రాకుండా ఉండిపోయాడు."

మంగమ్మ దగ్గర చేరిన వాళ్ళంతా రక రకాలుగా వ్యాఖ్యానించుకుంటూ బాధపడుతున్నారు. పలు రకాలుగా జాలి పడుతున్నారు. సానుభూతి చూపుతున్నారు.

కానీ మంగమ్మ మూసిన కన్ను తెరవకుండా పడి ఉంది.

ఆ ఊళ్ళో ఆమెకు అండగా ఉండే కరణం గారు వెంటనే కొడుక్కి - టెలిగ్రామ్ ఇచ్చారు. డాక్టరును తీసుకు వచ్చి వైద్యం చేయించారు.

అయినా ఆమె ఆరోగ్యం రోజు రోజుకీ దిగజారిపోతోంది.

డాక్టరు సైతం పెదవి విరిచాడు.

జనం కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు. కొడుకును శాపనార్థాలు పెట్టారు.

మంగమ్మ మరింత కృశించి పోయింది. ఎగశ్వాస కూడా వచ్చింది. ఇక లాభం లేదనుకుని మంచం మీద నుంచి క్రిందికి దింపబోతుంటే వాకిట్లో ఏదో కలకలం.

"కృష్ణారావు వచ్చాడు. భార్యా పిల్లల్నే కాదు, డాక్టర్లను కూడా వెంటబెట్టుకు వచ్చాడు." అన్నారెవరో.

జనం పక్కకు తొలిగారు. కృష్ణారావు వస్తూనే తల్లిని పొదివి పట్టుకుని చిన్న పిల్ల వాడిలా ఏడ్చాడు. "అమ్మా. ప్రతి జాబులోనూ నే నెంతో ఆరోగ్యంగా ఉన్నాను - బాబూ? అంటూ రాశావు! ఇదేనా నీ ఆరోగ్యం? నా కొక్కసారీ ఇలా ఉందని రాయలేకపోయావే మమ్మా?" అంటూ విలపించాడు.

కరణంగారిని అడిగాడు. "మీరైనా అమ్మ ఆరోగ్యం విషయం రాయకపోయారా?" అంటూ.

"అమ్మ గారి ఆరోగ్యం మొన్నటి వరకూ బాగానే ఉంది బాబూ? లోపల్లోపల మిమ్మల్ని చూడలేకపోతున్నాననే దిగులుండేదేమో కాని పైకి ఎంత ధైర్యంగానో తిరిగేవారు. బాబుని పిలిపించుదామంటే ఒప్పుకునేవారు కాదు. వాడికి అక్కడ ఎన్ని పనులో అంటూ వారించే వారు" అన్నాడు.

డాక్టర్లు వెంటనే ట్రీట్‌మెంట్ మొదలుపెట్టారు.

కృష్ణారావు కన్నీరు మున్నీరుగా విలపిస్తూనే ఉన్నాడు. "నా కోసం ఎంత కష్టపడిందీ నేను మరిచిపోయాననుకున్నావా అమ్మా? నాకు వెలుగు నిండిన జీవితం ఇవ్వాలని ఎంత ఆరాటపడిపోయావో నాకు తెలియదా? కాని బాధ్యతలు నా కాళ్ళకు బంధాలువేశాయి. మనను నీ దగ్గరే ఉన్నా తరగని దూరం మన ఇద్దరి మధ్యా ఉండిపోయిందమ్మా?" అంటూ రోదిస్తున్నాడు.

రెండు రాత్రులు గడిచాయి. ఆ రెండు రోజులూ అందరికీ భయంకరమైన క్షణాలే. మూడేనాటికి డాక్టర్లు ప్రాణం భయం లేదన్నారు. కానీ స్పృహలోనికి రాలేదు.

మరో రెండు రోజులకు నెమ్మదిగా కళ్ళు విప్పింది. కానీ ఎవరినీ గుర్తించలేదు. నోట మాట లేదు. అదోలాంటి మగతలో ఉండిపోయింది.

ఆ సాయంత్రం ఆమె పెదవుల మీద అస్పష్టంగా పలికింది- "కిట్టూ? బాబూ? కిట్టూ?"

కృష్ణారావు ఆనందంతో, ఆత్రతతో తల్లి మీదకు ఒంగి "నే నొచ్చేశానమ్మా? నీ కిట్టూని వచ్చేశానమ్మా?" అన్నాడు చెంపలపై జాలువారుతున్న కన్నీటితో.

తేరిపార చూసింది మంగమ్మ. కృశించి పోయినట్లున్న ముఖంలో ఏ మూలో గొప్ప ఆనందపు కాంతి... లోతుకు పోయిన కళ్ళల్లో జీవం. ఎండిన పెదవులపై పలచని చిరునవ్వు.

"ఎవరు నాయనా? అలా కూర్చో - నా బాబు కిట్టూ ఎక్కడ? నా చిన్న తండ్రి కిట్టయ్య ఏం చేస్తున్నాడు? మట్టిలో ఆడుతున్నాడా, పిల్లలతో గోలీలు ఆడుతున్నాడా? ఏమర్రా నా బాబును పిలవండి."

హతాశుడయ్యాడు కృష్ణారావు. డాక్టర్ల వైపు చూశారు.

"సారీ కృష్ణా. ఆరోగ్యం ఫరవాలేదు గానీ మతి స్థిరత్వం తప్పింది. ఎవరేం చేయలేం" అన్నారు.

మంగమ్మ లేచి కూర్చుంది - "పాల బువ్వ కలిపాను రా కిట్టూ? వచ్చి ఒక్క ముద్ద తినిపో. నా తండ్రివి కదూ? బంగారు కన్నయ్యవి కదూ? రేపు పలకా బలపం తెస్తానుగా?" అంటుంది.

కృష్ణారావు ఎగసి వస్తున్న దుఃఖంతో - "ఈ జీవితం నీకు చీకటిలో మిగిల్చిందని - వెలుగు దారిని వెతుక్కుంటూ వెళ్ళిపోతున్నావా అమ్మా? నీ చిన్ని కృష్ణుడి కోసం నీ లోకంలోకి వెళ్ళిపోతున్నావా?" అంటూ రెండు చేతుల్లో ముఖం దాచుకున్నాడు.


*

# వ్యాయామం - క్రీడలు



నెల్లూరు జిల్లా వెంకటగిరి వాస్తవ్యులైన స్వర్గీయ జె.వి.ఎస్. ధర్మారావు వెంకటగిరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి రిటైర్ అయ్యారు. వారు విద్యా వృత్తిలో ఎంత పేరు సంపాదించారో, అంతకు మించిన పేరును క్రికెట్ రంగంలో కూడా సంపాదించారు. వెంకటగిరి సంస్థానం క్రికెట్ క్లబ్‌కు ఆడుతూ, పాతిక సంవత్సరాలు కార్యదర్శి పదవిని కూడా నిర్వహించారు. ఆంధ్రా క్రికెట్ సంఘ దక్షిణ మండలానికి కార్యదర్శిగా పది సంవత్సరా లున్నారు. ఆంధ్ర జట్లకు 1954 నుంచి 68 వరకు అనేక పర్యాయాలు మేనేజరుగా రంజీట్రోఫీ పోటీల్లో పాల్గొన్నారు. ఆంధ్రా రంజీట్రోఫీ ఎన్నికల సంఘానికి సభ్యులలో ఒకరిగా పది సంవత్సరాలు వ్యవహరించారు. 1960-61 పాకిస్థాన్ జట్టుతో పోటీ చేసిన దక్షిణ మండల జట్టు ఎంపిక కమిటీ సభ్యులలో వీరు ఒకరు. అటు విద్యా రంగంలోనూ, ఇటు క్రీడా రంగంలోనూ సేవ చేసి తనువు చాలించారు.

- ఏకా



# న్యాయదర్శనం

## 'రాజకీయ పార్టీతో పొత్తు ఉన్నా ఉద్యోగం ఇవ్వాల్సిందే'

మధ్యప్రదేశ్ గవర్నమెంట్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పోస్టులను భర్తీ చేసేందుకు వార్తా పత్రికలలో ప్రకటన జారీ చేసి, అర్హతలున్న అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరింది. అది చూసి ఆ పోస్టుకు అప్లయి చేసిన వారిలో అలోక్‌గుప్తా ఒకడు. తతంగం అంతా అయిపోయిన తరువాత 45 మందితో సెలెక్ట్ లిస్ట్ తయారయింది. దానిలో అలోక్‌గుప్తా కూడా ఉన్నాడు. కాని అతనినీ, మరొకరినీ తప్పించి తతిమా వారందరికీ ఉద్యోగా లిచ్చారు.

దాని మీద అలోక్‌గుప్తా హైకోర్టుకు వెళ్ళాడు. తనకు ఉద్యోగం ఇవ్వకపోవడం అక్రమం, అన్యాయం, నిరంకుశం అని అతని వాదన.

అలోక్‌గుప్తాకు లోక్ సంఘర్షణ సమితితో సంబంధా లుండేవి. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా కరపత్రాలు పంచుతూ 1975 డిసెంబర్‌లో నినాదాలు చేశాడు. దానికి గాను నాలుగు నెలల శిక్ష కూడా అనుభవించాడు. ఈ విషయాలు పోలీసు వెరిఫికేషన్‌లో తేలింది. అందువలన అనర్హుడని, అతనికి ఉద్యోగం ఇవ్వలేదని అన్నది గవర్నమెంట్.

అలాంటి రూలు ఏమయినా ఉంటే చూపమన్నది హైకోర్టు. రూలు అవసరంలేదు, ఒకసారి శిక్ష పడ్డ తరువాత అతను గవర్నమెంట్ ఉద్యోగానికి పనికిరాడు అన్నది గవర్నమెంట్.

ప్రతి శిక్షా అనర్హత క్రిందకు రాదని, నైతికంగా దిగజారిపోయిన సంఘటనల వలన శిక్ష పడితే అది మాత్రమే అనర్హత క్రిందకు వస్తుందని-ఇతని విషయంలో అలాంటి దేమీ లేదని రాజకీయ పార్టీలతో పొత్తు ఉన్నంతమాత్రాన ఉద్యోగానికి అర్హత లేకుండా పోదని చెపుతూ అందరికీ ఇచ్చినట్లుగానే అలోక్‌గుప్తాకు కూడా ఉద్యోగం ఇవ్వమని గవర్నమెంటును ఆదేశించింది మధ్యప్రదేశ్ హైకోర్టు.

- ఎమ్.ఎస్. శర్మ